సాక్షి
ప్రకాశం

శనివారం | 22 | ఏప్రిల్ | 2023



వరాల వసంతం
నేడు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. నెలరోజులుగా పాటిస్తున్న ఉపవాస దీక్షలను ముగించి ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.
- IIలో..




పెనుగాలుల విధ్వంసం
గిద్దలూరు నియోజకవర్గంలో శుక్రవారం సాయంత్రం పెనుగాలులతో కూడిన వర్షం విధ్వంసం సృష్టించింది. పలుచోట్ల చెట్లు, పెడ్లు కుప్పకూలాయి.
- IIలో..

గరిష్టం/కనిష్టం
38 /28

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రంజాన్‌ను ఆనందంగా జరుపుకోవాలి
- ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బాలినేని



ఒంగోలు: ముస్లింలు పవిత్ర రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. నెలరోజులుగా ఎంతో పవిత్రంగా ఉపవాస దీక్షలు చేసి పండుగ జరుపుకుంటున్న ముస్లింలందరి కుటుంబాల్లో అల్లా వెలుగులు నింపాలని ప్రార్థిస్తున్నట్లు బాలినేని పేర్కొన్నారు. ముస్లింలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.


శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రముఖులు...

ముస్లింలకు రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావులు వేర్వేరు ప్రకటనల్లో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ముస్లింలందరూ పేదలకు దానాలు, ధర్మాలు చేయాలని, నమాజులు, విందులతో రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

29న నవోదయ ప్రవేశ పరీక్ష
ఒంగోలు: ఒంగోలు జవహర్ నవోదయ విద్యాసమితిలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు 15 సెంటర్లలో పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.జయశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్లు తీసుకుని కేటాయించిన సెంటర్‌లో పరీక్షకు హాజరుకావాలన్నారు. తమ విద్యా సమితి పరిధిలో కందుకూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, వలేటివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల, సింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఒంగోలు బండ్లమిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఒంగోలు మున్సిపల్ ఉన్నత పాఠశాల, పీవీఆర్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, అద్దంకి ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, మార్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, పర్చూరు వైఆర్ ఉన్నత పాఠశాల, చీరాల ఎన్ఆర్అండ్‌పీఎం ఉన్నత పాఠశాల ఉన్నాయని వివరించారు.

25న జాబ్ మేళా
ఒంగోలు అర్బన్: జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం ఈ నెల 25వ తేదీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో ఒంగోలు, మార్కాపురం, చీరాల ప్రాంతాల్లో పని చేసేందుకు అవసరమైన డెవలప్‌మెంట్ మేనేజర్, ఏజెన్సీ మేనేజర్, సీనియర్ ఏజెన్సీ మేనేజర్, టెర్రిటరీ మేనేజర్, సీనియర్ టెర్రిటరీ మేనేజర్ పోస్టులకు 25 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు మహిళలు, పురుషులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఉద్యోగాన్ని బట్టి రూ.19,500 నుంచి రూ.39,000 వేల వరకు వేతనంతో పాటు కన్వీనెన్స్, మొబైల్ అలవెన్స్ ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల యువత 25వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు విద్యార్హత పత్రాలతో రావాలని కోరారు.

మెరుగైన సేవలు అందించాలి



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం జాతీయ పౌరసేవల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రకాశం భవనంలో కలెక్టరేట్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పలు రకాల పనులు, సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని సూచించారు. పౌరసేవల దినోత్సవం నేపథ్యాన్ని ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత, కలెక్టరేట్ విభాగాల పర్యవేక్షకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ కాలేజీలకు వేసవి సెలవులు
ఒంగోలు: ఏపీలోని ఇంటర్ కాలేజీలకు ఈ నెల 22 నుంచి మే 31వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించినట్లు ప్రకాశం జిల్లా ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎ.సైమన్‌విక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తే అపరాధ రుసుం విధిస్తామని, కళాశాలల గుర్తింపు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు.

పశ్చిమాన ఫ్లాప్ షో



పశ్చిమ ప్రకాశంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పర్యటన ఫ్లాప్ షోగా మిగిలిపోయింది. మూడు రోజులు ఆయన ఇక్కడే ఉన్నా కేడర్‌లో ఏమాత్రం జోష్ కనిపించలేదు. ఆయన పార్టీ కేడర్‌పై అసహనం వ్యక్తం చేయడంతో పార్టీ నేతలు, కార్యకర్తలు చిన్నబుచ్చుకున్నారు. మూడు ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో ఆయన చేసిన ప్రసంగాలు ప్రజల్ని ఆకట్టుకోలేకపోయాయి. వెలిగొండ ప్రాజెక్టు, పశ్చిమ ప్రాంతం అభివృద్ధిపై ఆయన దశాబ్దకాలంగా చెబుతున్న అబద్ధాలే తిరిగి చెప్పారని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి.

- కేడర్‌లో జోష్ నింపని బాబు పర్యటన
- మూడు సభల్లోనూ ఆకట్టుకోని ప్రసంగం
- పాత హామీలే మళ్లీ..మళ్లీ
- మూడో రోజు సాయంత్రం వరకూ మార్కాపురంలో కాలక్షేపం
- అతి కొద్దిమంది రైతులతో మాట్లాడి మ..మ..అనిపించారు
- వై.పాలెంలో చంద్రబాబు పర్యటనకు దళితుల నిరసన సెగ
- బాబు సాక్షిగా బహిర్గతమైన నేతల మధ్య విబేధాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లాలో మూడు రోజుల పర్యటన ప్రజల్ని ఆకట్టుకోలేకపోయింది. ఆ పార్టీ కేడర్‌లో సైతం జోష్ నింపలేకపోయింది. వైఎస్సార్ కడప జిల్లా నుంచి జిల్లాలోని గిద్దలూరుకు బుధవారం రాత్రి ఆయన చేరుకున్నారు. అదేరోజు రాత్రి నిర్వహించిన బహిరంగ సభ జనం లేక వెలవెలబోయింది. మొదటి సభే అట్టర్ ఫ్లాప్ కావడంతో అక్కడి నుంచే టీడీపీ నాయకులు, కేడర్‌పై చంద్రబాబు అసహనాన్ని వ్యక్తం చేస్తూ ఉన్నారు. మూడు రోజుల పర్యటనలో చంద్రబాబు పార్టీ కేడర్‌లో ఊపు ఇవ్వలేకపోయారన్నది ఆ పార్టీ నేతల నోటి నుంచే వినిపిస్తోంది. గిద్దలూరు నుంచి ఆ రోజు రాత్రి 11 గంటలకు బయలుదేరి మార్కాపురం చేరుకున్నారు. మార్కాపురంలోనే బస చేశారు. గురువారం రెండో రోజు చంద్రబాబు పుట్టిన రోజు అక్కడే నిర్వహించుకున్నారు. తొలుత పుట్టిన రోజు వేడుకలను మార్కాపురంలో భారీగా నిర్వహించాలనుకున్నారు. జిల్లా వ్యాప్తంగా జన సమీకరణ చేయాలని చూశారు. కానీ, విఫలమయ్యారు. ఒక పక్క పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటూ ఉండగానే మహిళలు లేచి వెళ్లిపోవడం కనిపించింది. ఇక అదే రోజు సాయంత్రం మార్కాపురంలో నిర్వహించిన సభ సైతం తుస్సుమనిపించింది. వెలిగొండ ప్రాజెక్టు మీద చెప్పిందే చెప్పి.. మళ్లీ..మళ్లీ చెప్పి ప్రజలను విసుగెత్తించారు. తాను అధికారంలో ఉండగా ఒక టన్నెల్‌ను కూడా 5 కిలోమీటర్లు పూర్తి చేయించలేని ఆయన.. మళ్లీ అధికారంలోకి వస్తే వెలిగొండను ప్రారంభించి పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీరుస్తానంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. ముచ్చటగా మూడో రోజు సైతం శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ చంద్రబాబు మార్కాపురంలోనే కాలక్షేపం చేశారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం డాక్టర్లు, ఎంపిక చేసిన మీడియా ప్రతినిధులు, రైతులతో విడివిడిగా ముఖాముఖీలు ఉంటాయని నాయకులు తెలిపారు. అయితే, అలాంటివేమీ జరగలేదు. ఎంపిక చేసుకున్న కొద్దిమంది రైతులతో మాత్రమే ముఖాముఖి నిర్వహించి ముగించారు. అది కూడా మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకే జరిగింది.

సెల్ఫీలతో కాలక్షేపం..

మధ్యాహ్నం నుంచి చంద్రబాబు పార్టీ నేతలు, కార్యకర్తలతో సెల్ఫీలు దిగుతూ గడిపారు. సాయంత్రం 5 గంటలకు మార్కాపురం నుంచి యర్రగొండపాలెం బయలుదేరి వెళ్లారు. బయలుదేరినప్పటి నుంచే చంద్రబాబు కేడర్‌పై కొంత అసహనం వ్యక్తం చేస్తూ వచ్చారు.

దళితుల నిరసన సెగ...

యర్రగొండపాలెం పర్యటనకు వచ్చిన చంద్రబాబుకు దళితుల నుంచి సెగ ఎదురైంది. దళితులు చంద్రబాబు పర్యటనను అడ్డుకున్నారు. దళితులపై చేసిన వాఖ్యలకు క్షమాపణ చెప్పాలంటూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో చంద్రబాబు పర్యటనను అడ్డుకునే ప్రయత్నం చేశారు. నల్ల టీ షర్టులు, ప్లకార్డులు, నల్ల బెలూన్లు ప్రదర్శించి చంద్రబాబుకు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. చంద్రబాబు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దళితుల వ్యతిరేకి చంద్రబాబు అంటూ ఆయన పర్యటనను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దళితులను రెచ్చగొట్టే ప్రయత్నాలను చంద్రబాబు స్వయంగా చేశారు. నిరసన వ్యక్తం చేస్తున్న వారికి వేలు చూపించి మరీ బెదిరించారు. చంద్రబాబు ప్రసంగంతో టీడీపీ కేడర్ కూడా రెచ్చిపోయి దళితులపైకి రాళ్లు రువ్వడంతో వైఎస్సార్ సీపీ నేతలతో పాటు పలువురు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. చంద్రబాబు వ్యవహరించిన తీరు పలు విమర్శలకు దారితీసింది.

బయటపడిన విభేదాలు...

చంద్రబాబు పర్యటనలో గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో టీడీపీ నేతల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. అధినేత పర్యటన సందర్భంగా తమను పట్టించుకోలేదంటూ గిద్దలూరులో సాయికల్పన అలకబూనారు. అశోక్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే యర్రగొండపాలెం పట్టణంలో గ్రూపుల వారీగా అధినేత జన్మదిన వేడుకలు నిర్వహించారు. కొంత మంది నేతలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తీరుపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు.



టీ షర్టు విప్పి నిరసన వ్యక్తం చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

శాంతియుత నిరసనపై దాడులా..?

- కార్యకర్తలను రెచ్చగొట్టడం, ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజం
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: దళితులను అవమానపరిచే విధంగా మాట్లాడే చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే ఎస్సీ నియోజకవర్గాల్లో పర్యటించాలని కోరుతూ శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే తమపై చంద్రబాబు దాడులు చేయిస్తాడా..? అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రశ్నించారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద దళితులు, వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం రోడ్డు పక్కన నిలబడి నిరసన తెలుపుతున్న సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు యర్రగొండపాలెం పర్యటనకు వచ్చిన సమయంలో తన కాన్వాయ్‌ను అక్కడ ఆపి తన వెంట వచ్చిన టీడీపీ కార్యకర్తలను రెచ్చకొట్టారు. ఈ సంఘటనలో ముగ్గురు వైఎస్సార్ సీపీ నాయకులకు గాయాలయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు సీఎంగా చేసిన చంద్రబాబుకు కార్యకర్తలను రెచ్చకొట్టడం, ప్రజలకు మోసపు మాటలు చెప్పి ఓట్లు దండుకోవడమే తెలుసని అన్నారు. 2019 ఎన్నికల్లో ఆయన నైజం తెలుసుకున్న రాష్ట్ర ప్రజలు టీడీపీని భూస్థాపితం చేశారన్నారు. తన క్యాంపు కార్యాలయం ముందు నిరసన తెలిపేందుకు తామున్నామని తెలుసుకున్న చంద్రబాబు.. బోయలపల్లె వద్ద తన కాన్వాయ్ ఆపి దాడి చేయడానికి పథకం రచించాడని మంత్రి ఆరోపించారు. అతని కాన్వాయ్‌కు ఎటువంటి ఆటంకం కలగకుండా రోడ్డు మార్జిన్‌లో నల్లకండువాలు వేసుకుని ప్లకార్డులు, నల్ల బెలూన్లతో శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అక్కడే తన కాన్వాయ్‌ను ఎందుకు ఆపించారని ఆయన ప్రశ్నించారు. అంతేగాకుండా కారు ఎక్కి నిరసన తెలుపుతున్న తమను వేలు ఎత్తి చూపించి హెచ్చరించి కార్యకర్తలను రెచ్చకొట్టడం వలనే వారు దాడులకు దిగారని ఆయన అన్నారు.

నిరసనకు బారులుదీరిన దళితులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు...

దళితులను అవమానపరిచే విధంగా మాట్లాడే చంద్రబాబు.. క్షమాపణ చెప్పిన తర్వాతే ఎస్సీ నియోజకవర్గంలోకి అడుగు పెట్టాలని డిమాండ్ చేస్తూ మంత్రి ఆదిమూలపు సురేష్ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గం నుంచి దళితులు, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద సంఖ్యలో నిరసనలో పాల్గొన్నారు. నిరసనకు పోలీసులు అభ్యంతరం తెలపడంతో మంత్రి తన క్యాంపు కార్యాలయం వద్దే నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నిరసన వ్యక్తం చేస్తున్న వారిపై దాడులు చేసేందుకు మంత్రి క్యాంపు కార్యాలయం వద్దకు రావడానికి టీడీపీ నాయకులు ప్రయత్నించారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే దాడులు చేయడానికి రావడం ఏంటంటూ తాను వేసుకున్న నల్ల టీ షర్టును మంత్రి విప్పారు. నిరసన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు, డప్పు కళాకారుల పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కవలకుంట్ల గోవిందప్రసాద్, వైఎస్సార్ సీపీ ముండ్లమూరు మండల ప్రధాన కార్యదర్శి జి.ప్రసన్నకుమార్, ఏఎంసీ చైర్మన్ యు.శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీలు డి.కిరణ్‌గౌడ్, బి.గురవయ్య, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, మాకం జాన్‌పాల్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, రమణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, సర్పంచ్‌లు అరుణాబాయి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇక ఏకేయూ నుంచే..

- ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 248 కాలేజీలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయానికి బదిలీ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 2023-24 విద్యా సంవత్సరం నుంచే తరగతులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏకేయూ వీసీ మారెడ్డి అంజిరెడ్డి, పక్కన రిజిస్ట్రార్, డీన్

ఒంగోలు: జిల్లాకు ప్రత్యేక యూనివర్సిటీ అనేది అర్ధ శతాబ్దపు కల. ఐదారేళ్లుగా అది నెరవేరుతున్నట్లు అనిపిస్తున్నా పూర్తిస్థాయిలో సాకారం కాలేదు. ప్రస్తుతం పరిపూర్ణం కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 248 కాలేజీలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి ఆంధ్రకేసరి యూనివర్సిటీకి బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. శుక్రవారం యూనివర్సిటీ ప్రాంగణంలో రిజిస్ట్రార్ హరిబాబు, డీన్ వెంకటేశ్వరరెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏకేయూ వైస్ చాన్స్‌లర్ మారెడ్డి అంజిరెడ్డి యూనివర్సిటీలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు.

రూ.83 కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు...

గత ఫిబ్రవరి 9వ తేదీ ఏకేయూకు వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. వచ్చిన వెంటనే జిల్లా పరిధిలోని అన్ని కాలేజీల యాజమాన్యాలను సంప్రదించారు. పేర్నమిట్ట కొండపై యూనివర్సిటీకి కేటాయించిన 110 ఎకరాల స్థలాన్ని, అందులో ఉన్న భవనాలను పరిశీలించారు. చిన్నచిన్న మరమ్మతులు చేసి వాటిని వినియోగించుకోవచ్చని భావించారు. ఆ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రూ.200 కోట్లు అవసరమని భావిస్తూ.. ముందుగా కనీసం రూ.83 కోట్లు మంజూరు చేయాలంటూ ప్రతిపాదనలు పంపారు. ఇంకో వైపు హయ్యర్ ఎడ్యుకేషన్ విభాగం, విద్యాశాఖామంత్రి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధికారులతో చేసిన సంప్రదింపులు ఫలించాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని 12 నియోజకవర్గాల్లో ఉన్న 248 కాలేజీలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధి నుంచి తప్పించి ఆంధ్రకేసరి యూనివర్సిటీకి గుర్తింపును బదిలీ చేశారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచే ఆంధ్రకేసరి యూనివర్సిటీ పేరుతో విద్యాభ్యాసానికి గ్రీన్‌సిగ్నల్ రావడంతో ఏకేయూ పూర్తిస్థాయిలో ఏర్పాటైంది.

కొత్త కోర్సుల ఏర్పాటుపై దృష్టి...

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 10 ప్రభుత్వ, 10 ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. ఇవి కాకుండా ప్రైవేటు డిగ్రీ కాలేజీలు 77, పీజీ-7, ఎంబీఏ-7, ఎంసీఏ-2, లా-2, ఫార్మసీ-2, ఓరియంటల్ కాలేజీ-1, బీఈడీ కాలేజీలు-119, హోటల్ మేనేజ్‌మెంట్-1, ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలు-8 ఉన్నాయి. మొత్తం 248 కాలేజీలు ఏకేయూకు బదిలీ అయ్యాయి. ఇవి కాకుండా ప్రతి యూనివర్సిటీకి ఒక యూనివర్సిటీ కాలేజీ ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీజీ సెంటర్ ఆంధ్రకేసరి యూనివర్సిటీ కాలేజీగా మారుతుంది. ఇప్పుడున్న కోర్సులన్నీ సోషల్, సైన్స్ కోర్సులు మాత్రమే కావడంతో ప్రస్తుతం ఉన్న క్యాంపస్‌లోనే నిర్వహిస్తారు. అనుబంధంగా ఒక హాస్టల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఎంఎస్సీ మ్యాథ్స్, ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ సైన్స్ కోర్సులు మాత్రమే ఉన్నాయి. తాజాగా ఎంఎస్సీ ఫిజిక్స్, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎంఎస్సీ ఎనాలిటికల్ కెమిస్ట్రీ, ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, జిల్లాలో మైనింగ్ ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఎంఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎంఎస్సీ ఆక్వా కల్చర్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. ఇవి కాకుండా ఇంజినీరింగ్ విభాగంలో కంప్యూటర్ రిలేటెడ్ కోర్సులు, కంప్యూటర్ అప్‌డేటింగ్స్, ఫేషియల్ టెక్నాలజీ కోర్సులతో పాటు సివిల్ ఇంజినీరింగ్‌ను ప్రవేశపెట్టనున్నారు. అదనంగా లా కోర్సులు, ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు మారుతున్న బోధనలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఫర్ పెడగాగీ కోర్సు ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వీటిలో ఇంజినీరింగ్ మినహా మిగిలినవన్నింటికీ ఈ ఏడాది నుంచే అనుమతులు వస్తాయని ఆశిస్తున్నారు.

సీట్లన్నీ భర్తీ చేస్తాం : మారెడ్డి అంజిరెడ్డి, వీసీ

యూనివర్సిటీ కాలేజీలలో ఉన్న కోర్సులకు సంబంధించి వందశాతం సీట్ల భర్తీ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. ఒక్కో కోర్సుకు 30 సీట్లు కన్వీనర్ కోటాను, మరో 10 సీట్లు మేనేజ్‌మెంట్ కోటాను భర్తీ చేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేశాం. జిల్లా అవసరాలకు తగిన కోర్సులనే కాకుండా కంప్యూటర్ విద్యకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని నూతన కోర్సులు ప్లాన్ చేస్తున్నాం.

గడపగడపకు ఒక యజ్ఞం లాంటిది



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- ఏ ముఖ్యమంత్రి తీసుకోని నిర్ణయం వైఎస్ జగన్ తీసుకున్నారు
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- గద్దలగుంటలో బ్రహ్మారథం

ఒంగోలు సబర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఒక యజ్ఞం లాంటిదని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలు నగరంలోని 32వ డివిజన్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలతతో కలిసి గద్దలగుంటలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న తీరును బాలినేని స్వయంగా ప్రజలనడిగి తెలుసుకున్నారు. గడప గడపకు వెళుతుంటే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఎంత బాగా అమలవుతున్నాయో అర్థమవుతోందని బాలినేని అన్నారు. ప్రజలు కొన్ని సమస్యలను స్వయంగా తన దృష్టికి తీసుకొస్తున్నారని, అలాంటి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. ఏ ముఖ్యమంత్రి తీసుకోని విప్లవాత్మకమైన, ప్రయోగాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా సీఎం వైఎస్ జగన్ నిలిచిపోతున్నారని చెప్పారు. ఇప్పటి వరకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు కొత్తగా ఇటీవల ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని వినూత్నంగా సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం ద్వారా మారుమూల పల్లెల్లో సైతం ఇళ్లకే వెళ్లి వైద్యులు వైద్యం అందిస్తారని బాలినేని వివరించారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. ఒంగోలు నగరంతో పాటు నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజల ఇబ్బందులేమైనా ఉంటే తన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. గద్దలగుంటలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామని, ఇంకా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని బాలినేని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు కఠారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనా వెంకట్రావు, ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్ ఈదుపల్లి గురునాథం, సభ్యుడు కుర్రా ప్రసాదు, దామరాజు క్రాంతి కుమార్, ట్రేడ్ యూనియన్ నాయకుడు పుచ్చకాయల గోవర్దన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బొమ్మినేని మురళి, కోసూరి శేఖర్, తోటపల్లి సోమశేఖర్, కొల్లా అశోక్, బడుగు ఇందిర, చిట్టెం సురేష్, మన్నేపల్లి అంకబాబు, జువ్విశెట్టి వెంకట్రావు, నత్తల బీమేష్, గాజుల సాయి, ఓగిరాల వెంకట్రావు, తోటపల్లి వెంకటేష్, గరికపాటి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ పక్కాగా జరగాలి

- చెల్లింపులు కూడా త్వరగా జరిగేలా చూడాలి
- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రబీ సీజన్ ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవనంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశానికి మండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్సీ పోతుల సునీత, పీడీసీసీబీ చైర్మన్ మాదాసి వెంకయ్య పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం రైతులకు చెల్లింపులు కూడా త్వరగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. వ్యవసాయ శాఖ అనుబంధ రంగాల వారీగా సమీక్షించి రైతు ఉత్పత్తి సంఘాలు చురుగ్గా పనిచేసేలా చూడాలన్నారు. ఆరోమా ప్లాంటేషన్‌పై రైతులు దృష్టి సారించేలా అవగాహన కల్పించాలన్నారు. వచ్చే నెల రెండో వారంలో ఈ అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజీల అభివృద్ధి, డ్రిప్ ఇరిగేషన్ పరికరాల సత్వర పంపిణీపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఆళ్ల రవీంద్రారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడానికి ముందే విత్తనాలు, ఎరువులపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. మాదాసి వెంకయ్య మాట్లాడుతూ రైతులకు అన్నివేళలా అండగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ సిబ్బంది కూడా రైతులకు అవసరమైన సహాయ, సహకారాలు అందించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రూ.5,086 కోట్లకు కేవలం రూ.3 లక్షలు మాత్రమే చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గ్లోరియా తెలిపారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంపై ఏపీసీఎన్ఎఫ్ రూపొందించిన పుస్తకాలతో పాటు నవధాన్యాల సాగుపై పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ ఉషాకిరణ్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి బేబిరాణి, ఆత్మ పీడీ అన్నపూర్ణ, ఏపీసీఎన్ఎఫ్ డీపీడీ సుభాషిణి, ఏపీఎంఐపీ పీడీ రవీంద్రబాబు, జిల్లా ఉద్యానవన అధికారి గోపీచంద్, ఎల్‌డీఎం యుగంధర్, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఉపేంద్ర, మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, ఇతర అధికారులు, మండలి సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహిత మృతి

చీమకుర్తి: ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఎస్సై రామిరెడ్డి కథనం మేరకు.. చీమకుర్తికి చెందిన తొట్టెంపూడి వెంకటరమణ(28)కు మద్దిపాడు మండలం గురవారెడ్డిపాలేనికి చెందిన బ్రహ్మయ్యతో వివాహమైంది. కొంత కాలంగా వెంకటరమణ కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈ నెల 19న కడుపు నొప్పి భరించలేక ఎలుకల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఒంగోలులోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందింది.

పోక్సో కేసులో నిందితునికి మూడేళ్ల జైలు

ఒంగోలు: బాలికను ప్రేమ పేరుతో వేధిస్తూ, అసభ్య పదజాలంతో దుర్భాషలాడిన ఘటనలో త్రిపురాంతకం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన నిందితుడు లంక సుమంత్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి 2017 నవంబరు 10న నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కోర్టులో చార్జిషీటు దాఖలు చేసిన అప్పటి ఎస్సై టి.త్యాగరాజు, సాక్షులను కోర్టులో హాజరుపరిచి నేరం నిరూపించడంలో కృషి చేసిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామేశ్వరరెడ్డిని ఎస్పీ అభినందించారు.



నేలకొరిగిన త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ ధ్వజ స్తంభం



కొమరోలు : పోసుపల్లెలో దర్గాపై పడిన భారీ చెట్టు, విద్యుత్ స్తంభం

పెనుగాలుల విధ్వంసం

- పశ్చిమ ప్రకాశంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం
- ఈదురు గాలుల ధాటికి నేలకొరిగిన భారీ వృక్షాలు
- త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో పడిపోయిన ధ్వజ స్తంభం
- స్తంభాలు కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాక్షి నెట్‌వర్క్: భీకరగాలుల ధాటికి పశ్చిమ ప్రకాశం చిగురుటాకులా వణికింది. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపగా సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుతో కూడిన వర్షం కురిసింది. బలమైన గాలులకు పలుచోట్ల వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కంభం ప్రాంతంలో అరటి తోటలు దెబ్బతిన్నాయి. బేస్తవారిపేట మండలంలోని పలు గ్రామాల్లో కళ్లాల్లో ఆరబోసిన మిరపకాయలు గాలికి కొట్టుకుపోయాయి. పెంచికలపాడులో రేకులషెడ్డు నేలకొరిగింది. ఒందుట్ల సమీపంలో హైవే పక్కన రెండు రోజులుగా కాలుతున్న భారీ చెట్టు విరిగిపడింది. కొమరోలులో వడగళ్ల వాన కురిసింది. ఎస్‌వీబీఎస్ కళాశాల ప్రాంగణంలో భారీ వృక్షం నేలకొరగగా గోడ ధ్వంసమైంది. పోసుపల్లె గ్రామంలో పెద్ద పీరయ్య స్వామి దర్గాపై భారీ వృక్షం, విద్యుత్ స్తంభం పడ్డాయి. గిద్దలూరు మండలం తాళ్లపల్లెలో వందేళ్ల వయసున్న జువ్వి చెట్టు నేలకొరగడంతో ట్రాక్టర్, కారు ధ్వంసమయ్యాయి. మార్కాపురం పాత బస్టాండ్‌లో ప్లెక్సీలు గాలికి ఎగిరి పూలు, పండ్ల బండ్లపై పడటంతో చిరువ్యాపారులకు సుమారు రూ.25 వేల ఆస్తి నష్టం సంభవించింది. తర్లుపాడు మండలంలోనూ చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ ధ్వజ స్తంభం నేలకొరిగింది. కాగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.



కంభంలో కూలిన విద్యుత్ స్తంభం



కంభం అర్బన్ కాలనీలో తీగలపై పడిన చెట్టుకొమ్మలు



గిద్దలూరు: తాళ్లపల్లెలో ట్రాక్టర్‌పై కూలిన వందేళ్ల నాటి జువ్వి చెట్టు

మోసాల బాబును నమ్మేదెవరు?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- అధికారం వెలగబెట్టిన ఐదేళ్లలో వెలిగొండను ఎందుకు పూర్తి చేయలేదు
- తన తమ్ముడిపై చంద్రబాబు ఆరోపణలను ఖండించిన ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: అధికారంలో ఉన్న ఐదేళ్లు వెలిగొండ ప్రాజెక్టును గాలికొదిలేసిన చంద్రబాబు.. వెలిగొండను తానే పూర్తి చేస్తానని చెప్పడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. పశ్చిమ ప్రకాశం ప్రజలను మరోమారు మోసం చేసేందుకు వెలిగొండ పేరుతో చంద్రబాబు డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. బాబు మాయమాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, అసలు వెలిగొండపై మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. గురువారం రాత్రి మార్కాపురం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన విమర్శలపై ఎమ్మెల్యే కేపీ స్పందించారు. శుక్రవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు 2004 –2009 మధ్య వైఎస్సార్ 80 శాతం పూర్తి చేశారని, చంద్రబాబు మాత్రం పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులను ఏటీఎంలా మార్చుకున్నారని విమర్శించారు. టీడీపీ ఇన్‌చార్జి ఇచ్చిన స్క్రిప్ట్ చదవడం మీ దౌర్భాగ్య స్థితిని తేటతెల్లం చేస్తోందని దుయ్యబట్టారు. అక్టోబర్‌లో వెలిగొండ ప్రాజెక్టును సీఎం జగన్ ప్రారంభిస్తారని, కొత్తగా అదనపు జిల్లాలు ఏర్పాటు చేస్తే అందులో మార్కాపురం ఉంటుందనే విషయాన్ని తమ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఇప్పటికే ప్రకటించారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో మార్కాపురం అభివృద్ధికి రూ.1525 కోట్లు కేటాయించిన సంగతి తెలుసుకోవాలని సూచించారు. టిడ్కో ఇళ్ల కోసం టీడీపీ హయాంలో స్థల సేకరణ మాత్రమే చేయగా తాము ఇళ్లు నిర్మించామని, సెల్ఫీ చాలెంజ్‌కు సిద్ధమా అని చంద్రబాబుకు సవాల్ విసిరారు.

తన తమ్ముడు కృష్ణమోహన్‌రెడ్డిపై చంద్రబాబు చేసిన విమర్శలను ఎమ్మెల్యే కేపీ తిప్పికొట్టారు. భూకబ్జాలు చేశారనడం సరికాదని, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి నిజానిజాలు నిర్ధారించుకోవచ్చని స్పష్టం చేశారు. విలేకర్ల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ, వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్‌గా లమారి శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, ఎంపీపీలు అరుణచెంచిరెడ్డి, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, పార్టీ ప్రధాన కార్యదర్శులు రవిచంద్ర, శేషయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వాచ్‌మన్ హత్య కేసులో నిందితుడు అరెస్టు

- వివరాలు వెల్లడించిన ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: కొండపిలోని మద్దులూరు రోడ్డులో ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తూ హత్యకు గురైన సంగన సుబ్బారెడ్డి కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ మలికాగర్గ్ స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కొండపి మండలం పోలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. మక్కెనవారిపాలెం పరిధిలోని గడియారం వారి కండ్రికకు చెందిన కడియం హనుమంతరావు(80) మద్యానికి బానిసయ్యాడు. తరచూ దుకాణం మూసివేసిన తర్వాత వచ్చి మద్యం కావాలని వాచ్‌మన్ సుబ్బారెడ్డితో గొడవపడేవాడు. ఈ క్రమంలో హనుమంతరావుపై సుబ్బారెడ్డి భౌతిక దాడికి పాల్పడ్డాడు. దీంతో కక్షగట్టిన హనుమంతరావు ఎలాగైనా సుబ్బారెడ్డిని హతమార్చాలనే ఉద్దేశంతో గడ్డ పలుగును తెచ్చిపెట్టుకున్నాడు. ఈనెల 13న రాత్రి 10.30 గంటల సమయంలో ఇద్దరి మధ్య వైన్ షాపు వద్ద గొడవ జరగ్గా సమీపంలోని వారు విడదీశారు. అనంతరం సుబ్బారెడ్డి వైన్‌షాపు వద్ద బాగా నిద్రమత్తులో ఉన్న సమయంలో హనుమంతరావు అక్కడకు చేరుకుని గడ్డ పలుగుతో దారుణంగా హతమార్చి పారిపోయాడు. నిందితుడు హనుమంతరావు జాళ్లపాలెం రోడ్డులో ఉండగా పోలీసులు అరెస్టు చేసి, అతడి నుంచి గడ్డపలుగును స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరగా ఛేదించేందుకు కృషి చేసిన దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, కొండపి సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రమణయ్యను ఎస్పీ మలికాగర్గ్ అభినందించి, ప్రశంస పత్రాలు, రివార్డులు అందించారు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

సంక్షేమ దివస్‌ను వినియోగించుకోండి

ఒంగోలు: పోలీసు సంక్షేమ దివస్‌ను సిబ్బంది వినియోగించుకోవాలని ఎస్పీ మలికా గర్గ్ సూచించారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లు, విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, హోంగార్డులు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని పరిపాలనాధికారిని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ ఓ.దుర్గాప్రసాద్, ఎస్సై సుదర్శన్, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీకి సమస్యలు తెలియజేస్తున్న కానిస్టేబుల్

అబద్ధాల బాబు వద్దే వద్దు

- జనం ఛీకొడుతున్నా ఆగని చంద్రబాబు తప్పుడు ప్రచారం
- తన స్వార్థం కోసం ఎందరినో బలిచేసిన వ్యక్తి చంద్రబాబు
- మైండ్‌గేమ్‌లో భాగమే వెలిగొండపై తప్పుడు వ్యాఖ్యలు
- మళ్లీమళ్లీ మోసపోయేందుకు జనం సిద్ధంగా లేరు
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పోతుల సునీత, సురేష్

ఒంగోలు: నోరు తెరిస్తే చాలు అబద్ధాలు వరదలా పారించడం చంద్రబాబు, లోకేష్‌లకు పరిపాటిగా మారిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత విమర్శించారు. జనం ఛీకొడుతున్నా వారు మాత్రం పాడిందే పాటరా పాసిపళ్ల దాసుడా అన్న చందంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 73 సంవత్సరాల వయసులోనూ చంద్రబాబు దుర్మార్గపు రాజకీయాలు చేయడం దారుణమన్నారు. జగన్ సర్కార్ సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక కుట్రలు, కుతంత్రాలతో మరోమారు ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. రూ.10 లక్షలతో శిలాఫలకం వేసి ప్రాజెక్టును సైతం తానే ప్రారంభిస్తానంటూ ప్రజలను నమ్మించాలని చూస్తున్నారన్నారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు బకాయిలు తీరుస్తానని, గెలిపిస్తే నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి ఎంతగా దగా చేసింది అందరికీ తెలుసన్నారు. బాబుకు అబద్ధాలు ఆడటం అలవాటుగా మారిందని, కానీ, ఆ అబద్ధాలను పదేపదే నమ్మడం ప్రజలకు అలవాటు కాదని అన్నారు. పుట్టినరోజు నాడు నూతన పథకం అంటే జనం అంతా ఏమిటా అనుకున్నారని, కోటీశ్వరులను చేస్తామని చెప్పడం చూసి విస్తుపోయారని అన్నారు. 2014 నాటికి 14 వేల కోట్ల డ్వాక్రా రుణాలు ఉంటే వాటిని చంద్రబాబు తీర్చక పోవడంతో అవి కాస్తా 2019 నాటికి పాతిక వేల కోట్లకు చేరాయని గుర్తుచేశారు. వాటిలో ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 19 వేల కోట్లకుపైగా డ్వాక్రా మహిళలకు చెల్లించారన్నారు. వెలిగొండ కాంట్రాక్టును తన బినామీ సీఎం రమేష్‌కు అప్పగించి చంద్రబాబు నిధులు దోచుకున్నారని, పోలవరాన్ని ఏకంగా ఏటీయంగా మార్చారని విమర్శించారు. ఒకవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను అధిగమిస్తూనే.. ఇంకో వైపు పేదల అభివృద్ధి, సంక్షేమమే తన లక్ష్యమంటూ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం ద్వారా టీడీపీకి 2024 ఎన్నికల్లో ప్రతిపక్ష పాత్ర కూడా ఉండదన్నారు. స్వార్థం లేని, దేవుడు, చల్లని ప్రజల ఆశీసులు నిత్యం కోరుకునే జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్క కుటుంబం తమ సొంతంగా భావిస్తోందన్నారు. ఎన్టీఆర్ నుంచి పార్టీ లాక్కుని ఆయనకు వెన్నుపోటు, హరికృష్ణకు మంత్రి పదవి ఇస్తానంటూ ఆపై దగా చేయడం, 2009 ఎన్నికల్లో జూనియర్ ఎన్టీఆర్‌ను పార్టీ ప్రచారానికి వాడుకుని నేడు ఆయన ఫొటో కనిపిస్తే చాలు ఉగ్రరూపం దాల్చడం.. ఇవన్నీ కూడా చంద్రబాబులోని 420 ఆలోచనలని అన్నారు. ఎస్సీలను అవమానించిన చంద్రబాబుకు వై.పాలెం నియోజకవర్గంలో పర్యటించే అధికారం లేదంటూ మండిపడ్డారు. త్వరలోనే వెలిగొండ ప్రాజెక్టు ద్వారా సీఎం జగన్ నీరు విడుదల చేయడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పోతుల సురేష్ పాల్గొన్నారు.

కేజీబీవీని పరిశీలించిన యూనిసెఫ్ టీమ్

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని శుక్రవారం కెరియర్ గైడెన్స్ కార్యక్రమంలో భాగంగా యూనిసెఫ్ సెంట్రల్ టీమ్ సభ్యులు పరిశీలించారు. ఉపాధ్యాయులు, బాలికలు, తల్లితండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పాఠశాల నిర్వహణ తీరును తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు ద్వారా పాఠశాలలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టిందని, మౌలిక వసతులు కల్పిస్తోందని టీమ్ సభ్యులకు ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ వివరించారు. తొలుత బాలికలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. టీమ్ సభ్యులు ఎస్.సుందరరామ్మూర్తి, పంకజ్ బాగేలా, ప్రదీప్ మాట్లాడుతూ.. పాఠశాల స్థితిగతులు, ఇంకా అభివృద్ధి చేసేందుకు అవసరమైన సూచనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు.



ఉపాధ్యాయులతో యూనిసెఫ్ టీమ్ సభ్యులు

స్థలం పొందిన వారంతా ఇళ్లు నిర్మించుకోవాలి

- లబ్ధిదారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ సూచన

నాగులుప్పలపాడు: జగనన్న కాలనీల్లో స్థలం పొందిన వారు ఇళ్లు నిర్మించుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బి.నిడమానూరు గ్రామంలోని జగనన్న కాలనీని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పనులు చేపట్టని వారు తక్షణమే ప్రారంభించకుంటే పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను సైతం త్వరితగతిన పూర్తి చేసి బిల్లులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం నిడమానూరు గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. తదనంతరం చదలవాడ సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కొలకలూరి విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ వడ్డిముక్కల శ్రీను, హౌసింగ్ పీడీ పేరయ్య, డీఈ ప్రసాద్, మండల ప్రత్యేకాధికారి అంజల, తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఏఈ రాజేష్, ఏపీఎం రవి, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి చేస్తున్న జగన్ ఎందుకు నచ్చడం లేదు?

- జనసేన నాయకులను నిలదీసిన ఆ పార్టీ కార్యకర్త

దర్శి టౌన్: పట్టణంలోని ఓ హౌస్‌లో జనసేన క్రియాశీల కార్యకర్తల సమావేశం వరికూటి నాగరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. బొటుకు రమేష్ వర్గీయులు సమావేశానికి గైర్హాజరయ్యారు. రాష్ట్ర అధికార ప్రతినిధి రావిపాటి అరుణ, యువ నాయకుడు దాసరి కిరణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌ను ఎందుకు సమర్థించడం లేదని ముండ్లమూరు మండలం ఈదరకు చెందిన రామాంజనేయులు జనసేన నాయకులను నిలదీశారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో అన్ని వర్గాలకు పార్టీలకు అతీతంగా నవరత్నాలు అందిస్తున్నారని గుర్తు చేశారు. గ్రామాల్లో ఆయనకు మద్దతుగా ప్రజలు ఉన్నారని, మన పార్టీ ఎందుకు సపోర్టు చేయడం లేదని ప్రశ్నించారు. అవాక్కైన జనసేన అధికార ప్రతినిధి రావిపాటి ఎంత మంచి చేసినా అందరికీ నచ్చాలని లేదు కదా? మన పార్టీ లైన్ తీసుకుని వెళ్లాలని సర్ది చెప్పారు.

వరాల వసంతం రంజాన్



కనిగిరిలో రంజాన్ ప్రార్థనల కోసం ఈద్గాలో ఏర్పాట్లు

కంభం/కనిగిరి రూరల్:

- ముగిసిన ఉపవాస దీక్షలు
- నేడు ఈద్ ఉల్ ఫిత్ర్
- ప్రత్యేక మాజ్‌కు ముస్తాబైన ఈద్గా, మసీదులు
- విందు, దానధర్మాలకు ప్రత్యేక ఏర్పాట్లు

వరాల వసంతం, శుభాల సరోవరం రంజాన్ మాసం ముగిసింది. నెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు శుక్రవారం మగ్‌రీబ్ నమాజ్ తర్వాత నెలవంకను దర్శించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ ముబారక్ తెలుపుకొన్నారు. రంజాన్ మాసం చివరి రోజు, చివరి శుక్రవారం కావడంతో ఒంగోలు, కనిగిరి, పొదిలి, మార్కాపురం, కంభం, గిద్దలూరు, పామూరు, తర్లుపాడు తదితర ప్రాంతాల్లో మసీదుల వద్ద సందడి నెలకొంది. జిల్లాలో సుమారు 2.30 లక్షల మంది ముస్లింలు శనివారం ఈద్ ఉల్ ఫిత్ర్ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

ఈద్ ఉల్ ఫిత్ర్ సందేశమిదే..

సర్వమానవాళికి కారుణ్యవర్షిణి అయిన రంజాన్ మాసంలో చివరి రోజు ఈద్ ఉల్ ఫిత్ర్‌ను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటారు. కఠోర దీక్ష ఆచరించిన ముస్లింలు తగిన ప్రతిఫలాన్ని అల్లాహ్ నుంచి పొందే రోజే ఈద్ ఉల్ ఫిత్ర్. రంజాన్ పండగ స్ఫూర్తిని గుండెల నిండా నింపుకొని ఈ ఆనందంలో అందరినీ భాగస్వాములను చేసేందుకు ముస్లింలు ప్రయత్నించాలి. జకాత్, ఫిత్ర్ పేరుతో సమాజంలోని అభాగ్యులపై మన బాధ్యతను లోపరహితంగా నెరవేర్చాలి. కుల మతాలు, వర్గవిభేదాలకు అతీతంగా మంచి మనుషులుగా స్పందిస్తూ సమాజంలోని దారిద్ర్యం, పేదరికం, అసమానతలను దూరం చేయాలి. శాంతి సామరస్యాలను, సంతోషాన్ని పెంపొందింపజేయాలనేదే 'ఈద్ ఉల్ ఫిత్ర్' సమాజానికి అందిస్తున్న సందేశం.

ఈద్గా వద్ద ప్రార్థన.. ప్రవక్త ఆజ్ఞ

ప్రతి ముస్లిం రంజాన్ పండగ రోజున ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్ చేయాలన్నది మొహమ్మద్ ప్రవక్త ఆజ్ఞ. వృద్ధులు, దివ్యాంగులు, ఈద్గా(వసతులు) లేని వారు తప్ప మిగిలినవారంతా ఈద్గా వద్దే రంజాన్ ప్రత్యేక నమాజు చేయాలని మతపెద్దలు పేర్కొంటున్నారు. ఈద్గాలో సామూహిక నమాజ్‌తో ఎంతో పుణ్యం దక్కుతుందని, అంతేగాక పేద, ధనిక అనే తారతమ్యం ఉండదని, తోటి వ్యక్తుల సాదకబాధలు తెలుసుకునే అవకాశం కలుగుతుందని ఇమామ్‌లు, మౌల్వీలు చెబుతున్నారు. ఈద్గా వద్దకు వెళ్లేటప్పుడు ఒక దారిలో తిరిగి వచ్చేటప్పుడు మరో దారిలో నుంచి రావాలనేది ప్రవక్త సందేశం.

తక్బీర్ తప్పనిసరి

ముస్లింలందరూ నూతన దుస్తులు ధరించి(వారి శక్తి కొలది) ఒక చోటకు చేరి అక్కడి నుంచి తక్బీర్ చదువుతూ ఈద్గా వద్దకు చేరుకోవాలి. ఈద్గాలో ఇమామ్ ఖురాన్ వాక్యాలు, దైవ సందేశాన్ని వినిపిస్తారు. అనంతరం రంజాన్(ఈద్ ఉల్ ఫిత్ర్) ప్రత్యేక నమాజు చదివిస్తారు. ఆ తర్వాత 'దువా'తో ప్రార్థనలు ముగుస్తాయి.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▲	నిఫ్టీ
23	0
59,655	17,624

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలి సెంట రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్‌	12,077	▲	20
డోజోన్స్‌	33,876	▲	8
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,914	▲	12
డాక్స్‌	15,882	▲	86
షాంఘై	3,301	▽	2
నికాయ్‌	28,564	▲	93

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ (రూ.లలో) ముంబై

బంగారం (24 క్యారట్‌)	60,191	▽	425
బంగారం (22 క్యారట్‌)	59,950	▽	423
వెండి (కిలో)	74,773	▽	646

సింఫనీ బీఎల్‌డీసీ ఎయిర్‌కూలర్లు



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: ప్రపంచంలో తొలిసారిగా బ్రష్‌లెస్‌ డీసీ ఎలక్ట్రిక్‌ మోటార్‌ (బీఎల్‌డీసీ) టెక్నాలజీతో పనిచేసే ఎయిర్‌ కూలర్లను సింఫనీ భారత మార్కెట్లోకి విడుదల చేసింది. సంప్రదాయ ఎయిర్‌కూలర్లతో పోలిస్తే ఇవి 60 శాతం తక్కువ విద్యుత్‌ను వినియోగిస్తాయని కంపెనీ వెల్లడించింది. 30, 55, 80 లీటర్ల సామర్థ్యంతో మూడు మోడళ్లను అందుబాటులోకి తెచ్చినట్టు సింఫనీ సీఎండీ అచల్‌ బకేరీ తెలిపారు.

తనిష్క్‌ నుంచి 'స్టన్నింగ్‌ ఎవ్రీ ఇయర్‌' చెవి రింగులు



హైదరాబాద్‌: టాటా గ్రూప్‌ కంపెనీ తనిష్క్, అక్షయ తృతీయ సందర్భంగా బంగారం, వజ్రాలతో తీర్చిదిద్దిన చెవి రింగులను 'స్టన్నింగ్‌ ఎవ్రీ ఇయర్‌' పేరిట విడుదల చేసింది. ఈ నూతన కలెక్షన్‌లో సంప్రదాయ ఝుంకీలు, ఆకర్షణీయ స్టడ్‌లు, డ్రాప్‌ ఇయర్‌ రింగ్స్‌ మరెన్నో ఉన్నాయి. వీటిని 18 క్యారెట్, 22 క్యారెట్లలో రూపొందించారు. పండుగ వేళ బంగారు ఆభరణాల మేకింగ్, డైమండ్‌ జ్యువెలరీ విలువపై 20% తగ్గింపు అందిస్తుంది. ఈ ఏప్రిల్‌ 24 వరకు ఈ ఆఫర్‌ అందుబాటులో ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)	
22-4-2023	
విశాఖ	375-00
చిత్తూరు	418-00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	365-00
విజయవాడ	365-00
రిటైల్‌ ధర (డజను)	60.00
21-4-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	358-00
వరంగల్‌	360-00
రిటైల్‌ ధర	4.20

రిలయన్స్‌ లాభాల రికార్డ్‌!

- క్యూ4లో నికర లాభం రూ. 19,299 కోట్లు
- కంపెనీ చరిత్రలోనే అత్యధికం
- రూ. 10 లక్షల కోట్లకు ఆదాయం



ఆర్థిక వృద్ధిలో భాగం

డిజిటల్‌ కనెక్టివిటీ, ఆర్గనైజ్‌డ్‌ రిటైల్‌ విభాగాలలో కంపెనీ కార్యకలాపాలు వ్యవస్థాగత సామర్థ్యాలకు బలాన్నిస్తున్నాయి. తద్వారా ప్రపంచంలోనే వేగవంత వృద్ధిని సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థలో భాగమవుతున్నాయి. ఫైనాన్షియల్‌ సర్వీసుల విభాగాన్ని విడదీసి జియో ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ పేరుతో లిస్ట్‌ చేయనున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24)లో ఎంజే ఫీల్డ్, ఆర్‌క్లస్టర్‌ తదితరాలతో కలిపి కేజీ-డీ6 బ్లాకులో గ్యాస్‌ ఉత్పత్తి రోజుకి 3 కోట్ల ప్రామాణిక ఘనపుమీటర్లకు చేరే వీలుంది.

–ముకేశ్‌ అంబానీ, రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ చైర్మన్, ఎండీ

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్‌ దిగ్గజం రిలయన్స్‌ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్‌) గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో సరికొత్త రికార్డును సాధించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 19 శాతం ఎగసి రూ. 19,299 కోట్లను తాకింది. ఒక త్రైమాసికానికి కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 16,203 కోట్లు మాత్రమే ఆర్జించింది. రిటైల్, టెలికం విభాగాలతోపాటు చమురు, పెట్రోకెమికల్స్‌ బిజినెస్‌ వృద్ధి ఇందుకు దోహదం చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2.14 లక్షల కోట్ల నుంచి రూ. 2.19 లక్షల కోట్లకు బలపడింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 66,702 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది కూడా సరికొత్త రికార్డుకాగా.. 2021-22లో రూ. కేవలం 60,705 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం దాదాపు రూ. 10 లక్షల కోట్లకు చేరింది. 2021-22లో రూ. 7.36 లక్షల కోట్ల ఆదాయం మాత్రమే అందుకుంది. పూర్తి ఏడాదికి ఆర్‌ఐఎల్‌ నిర్వహణ లాభం(ఇబిటా) తొలిసారి రూ. 1,54,691 కోట్లను తాకింది. ఇది 23 శాతం వృద్ధి. ఈ కాలంలో పెట్టుబడి వ్యయాలు రూ. 1,41,809 కోట్లుకాగా.. కంపెనీవద్దగల రూ. 1,93,282 కోట్ల నగదు బ్యాలెన్స్‌ను మినహాయిస్తే నికర రుణ భారం వార్షిక ఇబిటాకంటే తక్కువగా రూ. 1,10,218 కోట్లుగా నమోదైంది.

అన్ని విభాగాల జోరు: క్యూ4లో ఆర్‌ఐఎల్‌ ఇబిటా 22 శాతం జంప్‌చేసి రూ. 41,389 కోట్లను తాకింది. రిఫైనింగ్, పెట్రోకెమికల్స్‌(ఓటూసీ) ఇబిటా 14 శాతంపైగా ఎగసి రూ. 16,293 కోట్లకు, టెలికంసహా డిజిటల్‌ సర్వీసులు 17 శాతం మెరుగుపడి రూ. 12,767 కోట్లకు, రిటైల్‌ విభాగం 33 శాతం దూసుకెళ్లి రూ. 4,769 కోట్లకు, ఆయిల్, గ్యాస్‌ ఇబిటా రెట్టింపై రూ. 3,801 కోట్లకు చేరాయి. డీజిల్, ఏటీఎఫ్‌ ఎగుమతులపై విండ్‌ఫాల్‌ ట్యాక్స్‌ లాభాలపై రూ. 711 కోట్లమేర ప్రభావం చూపినట్లు ఆర్‌ఐఎల్‌ పేర్కొంది. అంతక్రితం క్యూ4లో రూ. 1,898 కోట్లమేర ప్రభావం పడినట్లు ప్రస్తావించింది.

ఆర్‌ఐఎల్‌ షేరు స్వల్ప వృద్ధితో 2,351 వద్ద క్లోజైంది. మార్కెట్‌ ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి.

రిలయన్స్‌ రిటైల్‌ భళా

గతేడాది(2022-23) క్యూ4(జనవరి-మార్చి)లో రిలయన్స్‌ రిటైల్‌ నికర లాభం 13 శాతం వృద్ధితో రూ. 2,415 కోట్లను తాకింది. 2021-22 క్యూ4లో రూ. 2,139 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 21 శాతం ఎగసి రూ. 61,559 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 50,834 కోట్ల అమ్మకాలు సాధించింది. ఆదాయంలో డిజిటల్, న్యూ కామర్స్‌ బిజినెస్‌ వాటా 17 శాతానికి చేరింది. ఇక మొత్తం స్టోర్ల సంఖ్య 18,040కు చేరింది. క్యూ4లో 2,844 స్టోర్లను జత చేసుకుంది. సర్వీసులతో కలిపి క్యూ4లో ఆదాయం రూ. 69,267 కోట్లను తాకగా.. ఇబిటా 33 శాతం వృద్ధితో రూ. 4,914 కోట్లకు చేరింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి మొత్తం ఆదాయం 32 శాతం జంప్‌చేసి రూ. 2,30,931 కోట్లను తాకింది. నికర లాభం 30 శాతం ఎగసి రూ. 9,181 కోట్లయ్యింది. సర్వీసులతో కలిపి స్థూల ఆదాయం రూ. 2,60,364 కోట్లుగా నమోదైంది. దేశీయంగా రిటైల్‌ రంగంలో రిలయన్స్‌ అత్యుత్తమ వృద్ధిని చూపుతున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ ఈషా ఎం.అంబానీ పేర్కొన్నారు.

జియో లాభం జూమ్‌

క్యూ4లో రూ. 4,984 కోట్లు



న్యూఢిల్లీ: ఆర్‌ఐఎల్‌ అనుబంధ సంస్థ, డిజిటల్‌ సర్వీసుల దిగ్గజం జియో ప్లాట్‌ఫామ్స్‌ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 16 శాతం బలపడి రూ. 4,984 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 4,313 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం పుంజుకుని రూ. 25,465 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 22,261 కోట్ల ఆదాయం నమోదైంది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 6.7 శాతం మెరుగై రూ. 178.8కు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 19,124 కోట్లయ్యింది. 2021-22లో రూ. 15,487 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 20 శాతం ఎగసి రూ. 1,15,099 కోట్లకు చేరింది. క్యూ4లో 2.9 కోట్లమంది జత కలవడంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 7 శాతం పెరిగి 43.93 కోట్లను తాకింది.

సంపదలో 6 శాతం పుత్తడికి..



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: భారత్‌తోపాటు చైనాకు చెందిన అల్ట్రా-హై నెట్‌ వర్త్‌ వ్యక్తులు (యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐ) గత సంవత్సరం పెట్టుబడి పెట్టదగిన సంపదలో 6 శాతం బంగారంలో ఉంచారని ప్రాపర్టీ కన్సల్టెంట్‌ నైట్‌ ఫ్రాంక్‌ ఇండియా నివేదిక వెల్లడించింది. '8 శాతం కేటాయింపులతో ఆస్ట్రేలియాకు చెందిన యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐలు తొలి స్థానంలో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా సగటు 3 శాతం కాగా, ఆసియా పసిఫిక్‌ ప్రాంతంలో ఇది 4 శాతంగా ఉంది. పెట్టుబడి పెట్టదగిన సంపదలో బంగారానికి భారతీయులు చేసిన కేటాయింపులు 2018లో 4 శాతం నమోదైంది. సంవత్సరాలుగా పుత్తడి అందించిన గణనీయమైన రాబడి ఈ పెరుగుదలకు కారణం. 2018-19 నుంచి 2022-23 మధ్య పసిడి 69 శాతం కంటే ఎక్కువగా రాబడిని అందించింది. మహమ్మారి తక్కువ వడ్డీ రేటుకు దారితీసింది. అంతర్జాతీయ కేంద్ర బ్యాంకులు అనుసరించిన సులభ నగదు లభ్యత వ్యూహం ధరలను భారీగా పెంచింది' అని నివేదిక వివరించింది. ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో స్థిరత్వాన్ని అందించే, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా పనిచేసే సాధనాలను ఆశ్రయిస్తున్నారని నైట్‌ ఫ్రాంక్‌ ఇండియా సీఎండీ శిశిర్‌ బైజల్‌ తెలిపారు.

హింద్‌ జింక్‌ లాభం క్షీణత

క్యూ4లో రూ. 2,583 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: హిందుస్తాన్‌ జింక్‌ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన జనవరి-మార్చి (క్యూ4)లో నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 2,583 కోట్లకు పరిమితమైంది. పెరిగిన వ్యయాలు ప్రభావం చూపాయి. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 2,928 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,074 కోట్ల నుంచి రూ. 8,863 కోట్లకు నీరసించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 10,511 కోట్లకు ఎగసింది.

సెన్సెక్స్‌ లాభం, నిఫ్టీ అక్కడే

- ట్రేడింగ్‌లో ఒడిదుడుకులు
- ఆటో, మెటల్‌ షేర్లలో అమ్మకాలు



ముంబై: జాతీయ, అంతర్జాతీయంగా ట్రేడింగ్‌ ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో స్టాక్‌ సూచీలు శుక్రవారం మిశ్రమంగా ముగిశాయి. ఫ్లాటుగా ప్రారంభమైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. మిడ్‌ సెషన్‌ నుంచి మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లు రాణించడంతో ఆరంభ నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. ఉదయం సెన్సెక్స్‌ 94 పాయింట్ల నష్టంతో 59,538 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 369 పాయింట్ల పరిధిలో 59,413 వద్ద కనిష్టాన్ని, 59,781 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 23 పాయింట్లు పెరిగి 59,655 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 16 పాయింట్ల లాభంతో 17,640 ప్రారంభమైంది. ఇంట్రాడేలో 17,554 - 17,663 వద్ద రేంజ్‌లో కదలాడింది. ఆఖరికి ఎలాంటి లాభనష్టాలకు లోనవకుండా గురువారం ముగింపు 17,624 వద్దే స్థిరపడింది. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, మీడియా, ఫార్మా షేర్లకు రాణించాయి. మెటల్, ఆటో, ఫైనాన్స్, బ్యాంకింగ్, రియల్టీ, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.



ఆధిక్యంలో అర్జున్‌

సాటీ జుల్డిజ్‌ ఓపెన్‌ అంతర్జాతీయ ర్యాపిడ్‌ చెస్‌ టోర్నీలో ఎనిమిది రౌండ్ల తర్వాత తెలంగాణ గ్రాండ్‌మాస్టర్‌ ఇరిగేశి అర్జున్‌ ఏడు పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన నాలుగు గేముల్లో మూడింట గెలిచిన అర్జున్, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. వఖిదోవ్‌ (ఉజ్బెకిస్తాన్‌), బిబిసారా (కజకిస్తాన్‌), బోరిస్‌ గెల్ఫాండ్‌ (ఇజ్రాయెల్‌)లపై నెగ్గిన అర్జున్‌ జర్మనీ గ్రాండ్‌ మాస్టర్‌ విన్సెంట్‌ కీమెర్‌తో జరిగిన గేమ్‌ను 'డ్రా'గా ముగించాడు. 12 మంది అగ్రశ్రేణి ప్లేయర్ల మధ్య 11 రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. నేడు చివరి మూడు రౌండ్లు జరుగుతాయి.

'పారిస్‌' టికెట్ల కోసం 40 లక్షల మంది దరఖాస్తు

వచ్చే ఏడాది జరిగే పారిస్‌ ఒలింపిక్స్‌ క్రీడలను ప్రత్యక్షంగా తిలకించేందుకు రెండో దశలో 40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే నెలలో ఆన్‌లైన్‌ లాటరీ ద్వారా 13 లక్షల మందిని ఎంపిక చేస్తారు. తొలి దశలో 32 లక్షల టికెట్లు అమ్ముడుపోయాయి.

పసిడి పోరుకు జ్యోతి సురేఖ జోడీ



జ్యోతి సురేఖ, ఓజస్‌ ప్రవీణ్‌

అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్‌ ఆర్చరీ స్టేజ్‌-1 టోర్నీలో కాంపౌండ్‌ మిక్స్‌డ్‌ టీమ్‌ ఈవెంట్‌లో భారత్‌కు పతకం ఖరారైంది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్‌ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, మహారాష్ట్ర ప్లేయర్‌ ఓజస్‌ ప్రవీణ్‌ దేవ్‌తలె ద్వయం ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన సురేఖ-ఓజస్‌ రెండో రౌండ్‌లో 159-157తో మరియా-గైల్స్‌ (లక్సెంబర్గ్‌)లపై... క్వార్టర్‌ ఫైనల్లో 159-156తో సోఫీ-అడ్రియన్‌ గోంటీర్‌ (ఫ్రాన్స్‌)లపై... సెమీఫైనల్లో 157-155తో ఫాతిన్‌ నూర్‌ఫతే-జువైది (మలేసియా)లపై గెలిచారు. నేడు జరిగే ఫైనల్లో చెన్‌ యి సువాన్‌-చెన్‌ చియె లున్‌ (చైనీస్‌ తైపీ)లతో జ్యోతి సురేఖ-ఓజస్‌ తలపడతారు. రికర్వ్‌ మిక్స్‌డ్‌ టీమ్‌ ఈవెంట్‌లో మాత్రం అతాను దాస్‌-భజన్‌ కౌర్‌ (భారత్‌) ద్వయం తొలి రౌండ్‌లో 3-5తో డెన్మార్క్‌ జోడీ చేతిలో ఓడిపోయింది.



ధీరజ్‌ అద్భుతం...

పురుషుల రికర్వ్‌ వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్‌ ప్లేయర్‌ ధీరజ్‌ బొమ్మదేవర అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి రౌండ్‌లో ధీరజ్‌ 6-0తో థియో కార్బొనెటి (బెల్జియం)పై, రెండో రౌండ్‌లో 6-4తో కెజియా చాబిన్‌ (స్విట్జర్లాండ్‌)పై, మూడో రౌండ్‌లో 6-4తో జిగా రావ్నికర్‌ (స్లొవేనియా)పై, నాలుగో రౌండ్‌లో 6-5తో అమెరికా దిగ్గజం బ్రాడీ ఇలిసన్‌పై, క్వార్టర్‌ ఫైనల్లో 6-4తో తరుణ్‌దీప్‌ రాయ్‌ (భారత్‌)పై గెలుపొందాడు. ప్రపంచ మాజీ చాంపియన్, మూడు ఒలింపిక్‌ పతకాలు నెగ్గిన ఇలిసన్‌తో జరిగిన మ్యాచ్‌లో ధీరజ్‌ 'షూట్‌ ఆఫ్‌'లో గెలిచాడు. ఇద్దరూ 10 పాయింట్లు స్కోరు చేసినా ధీరజ్‌ కొట్టిన బాణం 10 పాయింట్ల లక్ష్యబిందువుకు అతి సమీపంలో ఉండటంతో విజయం ఖరారు చేసుకున్నాడు.

మే 28న అహ్మదాబాద్‌లో ఐపీఎల్‌ ఫైనల్‌



న్యూఢిల్లీ: ఐపీఎల్‌ 16వ సీజన్‌ ప్లే ఆఫ్‌ దశ షెడ్యూల్‌ను బీసీసీఐ శుక్రవారం ప్రకటించింది. మే 23న క్వాలిఫయర్‌-1 మ్యాచ్‌కు... మే 24న ఎలిమినేటర్‌ మ్యాచ్‌కు చెన్నైలోని ఎం.ఎ.చిదంబరం స్టేడియం వేదికగా నిలుస్తుంది. మే 26న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం క్వాలిఫయర్‌-2 మ్యాచ్‌కు, మే 28న ఫైనల్‌ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇస్తుందని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

సందీప్‌ లమిచానె రికార్డు



కీర్తిపూర్‌ (నేపాల్‌): వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 100 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నేపాల్‌ స్పిన్నర్‌ సందీప్‌ లమిచానె రికార్డు నెలకొల్పాడు. ఆసియా క్రికెట్‌ కౌన్సిల్‌ (ఏసీసీ) ప్రీమియర్‌ కప్‌ టోర్నీలో భాగంగా ఒమన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సందీప్‌ మూడు వికెట్లు తీశాడు. తద్వారా 42 మ్యాచ్‌ల్లోనే 100 వికెట్ల మైలురాయిని అందుకున్న తొలి బౌలర్‌గా సందీప్‌ నిలిచాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు అఫ్గానిస్తాన్‌ స్పిన్నర్‌ రషీద్‌ ఖాన్‌ (44 మ్యాచ్‌లు) పేరిట ఉండేది.

సెమీస్‌లో బోపన్న జోడీ



బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్‌ ఏటీపీ-500 టెన్నిస్‌ టోర్నీలో రోహన్‌ బోపన్న (భారత్‌)-మాథ్యూ ఎబ్డెన్‌ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్‌ క్వార్టర్‌ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్‌ ద్వయం 6-2, 6-4తో సాంటియాగో గొంజాలెజ్‌ (మెక్సికో)-ఎడ్వర్డ్‌ రోజర్‌ వాసెలిన్‌ (ఫ్రాన్స్‌) జంటను ఓడించింది. 64 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్‌ రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్‌ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్‌ చేశారు.

చెన్నై చమక్‌...

బాధ్యత లేని బ్యాటింగ్, పసలేని బౌలింగ్‌తో సన్‌రైజర్స్‌ హైదరాబాద్‌ భంగపడింది. పటిష్టమైన బౌలింగ్, కట్టుదిట్టమైన ఫీల్డింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన చెన్నై సూపర్‌ కింగ్స్‌ ... సులభమైన లక్ష్యాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా ఛేదించింది. జడేజా స్పిన్‌ మ్యాజిక్, కాన్వే విలువైన ఫిఫ్టీతో చెన్నై ఈ సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదు చేసింది.

- సన్‌రైజర్స్‌పై ఏడు వికెట్లతో విజయం
- తిప్పేసిన జడేజా
- మెరిపించిన కాన్వే



కాన్వే



జడేజా

చెన్నై: ఐపీఎల్‌లో చెన్నై దూకుడు పెరుగుతోంది. హైదరాబాద్‌ను బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్‌ ఇలా అన్నిరంగాల్లో కట్టడి చేసిన సూపర్‌కింగ్స్‌ 7 వికెట్లతో జయభేరి మోగించింది. మొదట సన్‌రైజర్స్‌ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. అభిషేక్‌ శర్మ (26 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్‌) మెరుగ్గా ఆడాడు. చెన్నై బౌలర్లలో 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' రవీంద్ర జడేజా 3 వికెట్లు తీశాడు. అనంతరం సూపర్‌ కింగ్స్‌ 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (57 బంతుల్లో 77 నాటౌట్‌; 12 ఫోర్లు, 1 సిక్స్‌) అజేయంగా నిలిచాడు. మార్కండేకు 2 వికెట్లు దక్కాయి.

జడేజా మాయ...

హైదరాబాద్‌ ఇన్నింగ్స్‌ను ఎక్కడికక్కడ చెన్నై బౌలర్లు కట్టడి చేశారు. పవర్‌ ప్లేలో ఓపెనర్‌ హ్యారీ బ్రూక్‌ (13 బంతుల్లో 18; 3 ఫోర్లు) బౌండరీలతో వేగం పెంచినా... అంతలోనే ఆకాశ్‌ సింగ్‌ క్లీన్‌బౌల్డ్‌ చేశాడు. తర్వాత హిట్టర్‌ రాహుల్‌ త్రిపాఠి (21 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్‌) ఆడినా, కెప్టెన్‌ మార్క్‌రమ్‌ (12 బంతుల్లో 12; 1 ఫోర్‌) బ్యాటింగ్‌కు దిగినా... క్లాసెన్‌ (16 బంతుల్లో 17; 1 ఫోర్‌) క్రీజులోకి వచ్చినా... నిలిచింది కాసేపే! ధాటైన ఇన్నింగ్స్, చితగ్గొట్టే ఓవర్‌ ఒక్కటైన కనిపించలేదు. ఉన్నంతలో అభిషేక్‌ శర్మ చేసిన స్కోరే కాస్త మెరుగనిపించింది. అనుభవజ్ఞుడైన స్పిన్నర్‌ జడేజా కీలకమైన అభిషేక్, రాహుల్‌ త్రిపాఠి, మయాంక్‌ అగర్వాల్‌ (2) వికెట్లతో సన్‌రైజర్స్‌ స్కోరు ఏమాత్రం పెరగకుండా అడ్డుకున్నాడు.

కాన్వే ధనాధన్‌...

చెన్నై ముందున్న సులువైన లక్ష్యాన్ని రుతురాజ్‌ గైక్వాడ్‌ (30 బంతుల్లో 35; 2 ఫోర్లు) బౌండరీతో మొదలుపెట్టాడు. డెవాన్‌ కాన్వే ధనాధన్‌ ఆటతో పరుగులు వేగంగా వచ్చాయి. మార్కో జాన్సెన్‌ వేసిన ఆరో ఓవర్‌ను కాన్వే ఆదేపనిగా దంచేశాడు. ఎదుర్కొన్న 5 బంతుల్ని 4, 4, 6, 4, 4లుగా బౌండరీలకు తరలించడంతో 23 పరుగులొచ్చాయి. దీంతో పవర్‌ప్లేలో చెన్నై స్కోరు 60/0. టార్గెట్‌లో అటుఇటుగా సగం పనైపోయింది. 11వ ఓవర్లో రుతురాజ్‌ రనౌట్‌ కావడంతో 87 పరుగుల ఓపెనింగ్‌ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన అజింక్య రహానే (10 బంతుల్లో 9; 1 ఫోర్‌), ఇంపాక్ట్‌ ప్లేయర్‌ అంబటి రాయుడు (9 బంతుల్లో 9; 1 ఫోర్‌) విఫలమైనా కాన్వే అజేయంగా నిలబడి జట్టును గెలిపించాడు.

ఐపీఎల్‌ పాయింట్ల పట్టిక					
జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్‌	6	4	2	8	1.043
లక్నో	6	4	2	8	0.709
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్‌	5	3	2	6	0.192
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	5	3	2	6	-0.164
పంజాబ్‌	6	3	3	6	-0.298
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్‌	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్‌: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్‌ రన్‌రేట్‌

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్‌ x లక్నో (మ. గం. 3:30 నుంచి)
ముంబై x పంజాబ్‌ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్‌ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్‌ హైదరాబాద్‌ ఇన్నింగ్స్‌: బ్రూక్‌ (సి) రుతురాజ్‌ (బి) ఆకాశ్‌ 18; అభిషేక్‌ శర్మ (సి) రహానే (బి) జడేజా 34; రాహుల్‌ త్రిపాఠి (సి) ఆకాశ్‌ (బి) జడేజా 21; మార్క్‌రమ్‌ (సి) ధోని (బి) తీక్షణ 12; క్లాసెన్‌ (సి) రుతురాజ్‌ (బి) పతిరణ 17; మయాంక్‌ (స్టంప్డ్‌) ధోని (బి) జడేజా 2; జాన్సెన్‌ (నాటౌట్‌) 17; సుందర్‌ (రనౌట్‌) 9; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 134.** **వికెట్ల పతనం:** 1-35, 2-71, 3-84, 4-90, 5-95, 6-116, 7-134. **బౌలింగ్‌:** ఆకాశ్‌ 3-0-17-1, తుషార్‌ దేశ్‌పాండే 3-0-26-0, తీక్షణ 4-0-27-1, మొయిన్‌ అలీ 2-0-18-0, జడేజా 4-0-22-3, పతిరణ 4-0-22-1.

చెన్నై సూపర్‌ కింగ్స్‌ ఇన్నింగ్స్‌: రుతురాజ్‌ (రనౌట్‌) 35; కాన్వే (నాటౌట్‌) 77; రహానే (సి) మార్క్‌రమ్‌ (బి) మార్కండే 9; రాయుడు (బి) మార్కండే 9; అలీ (నాటౌట్‌) 6; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (18.4 ఓవర్లలో 3 వికెట్లకు) 138.** **వికెట్ల పతనం:** 1-87, 2-110, 3-122. **బౌలింగ్‌:** భువనేశ్వర్‌ 2-0-10-0, జాన్సెన్‌ 3-0-37-0, మార్క్‌రమ్‌ 1-0-11-0, సుందర్‌ 2.4-0-16-0, మార్కండే 4-0-23-2, ఉమ్రాన్‌ 3-0-18-0, డాగర్‌ 3-0-21-0.

సచిన్, కోహ్లి, రోహిత్‌ల 'బ్లూ టిక్‌' మార్క్‌ తొలగింపు

- ఈ జాబితాలో ధోని, సింధు, సైనా, సానియా, నిఖత్‌ జరీన్‌ తదితరులు
- డబ్బులు చెల్లిస్తేనే 'బ్లూ టిక్‌' సౌకర్యం కల్పిస్తున్న ట్విట్టర్‌



న్యూఢిల్లీ: ప్రముఖ సోషల్‌ నెట్‌వర్క్‌ సైట్‌ 'ట్విట్టర్‌' సెలబ్రిటీలకు మింగుడు పడని నిర్ణయం తీసుకుంది. క్రికెట్‌ దిగ్గజాలు సచిన్‌ టెండూల్కర్, విరాట్‌ కోహ్లి, బ్యాడ్మింటన్‌ స్టార్‌ పీవీ సింధు తదితర తారల ట్విట్టర్‌ ఖాతాలకు 'బ్లూ టిక్‌' మార్క్‌లను తొలగించింది. ఈ మార్క్‌లు అధికారిక ఖాతా (వెరిఫైడ్‌ ఐడెంటిటీ) అనే ముద్ర కలిగి ఉంటాయి. ఇన్నాళ్లు సెలబ్రిటీలు, జర్నలిస్టులు, ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగులకు ఉచితంగా 'బ్లూ టిక్‌ మార్క్‌'లను కల్పించింది. అయితే ఈ మైక్రో బ్లాగ్‌ సైట్‌ను టెస్లా సీఈఓ ఎలాన్‌ మస్క్‌ కొనుగోలు చేశాక నిబంధనలు మార్చారు. ఇందులో భాగంగా ఇకపై (ఏప్రిల్‌ 20 నుంచి) చెల్లింపు ఖాతాలకే 'బ్లూ టిక్‌' మార్క్‌లు కేటాయించాలని ట్విటర్‌ నిర్ణయించడంతో క్రీడా దిగ్గజాలు, సినీ తారలు 'బ్లూ టిక్‌'ను కోల్పోయారు. సచిన్, కోహ్లిలే కాదు... ధోని, రోహిత్‌ శర్మ, సైనా నెహ్వాల్, నీరజ్‌ చోప్రా, బజరంగ్‌ పూనియా, వినేశ్‌ ఫొగాట్, బాక్సర్‌ నిఖత్‌ జరీన్, సానియా మీర్జా, సునీల్‌ ఛెత్రి, పీఆర్‌ శ్రీజేశ్, అంతర్జాతీయ దిగ్గజాలు ఫెడరర్, రాఫెల్‌ నాదల్‌ (టెన్నిస్‌), క్రిస్టియానో రొనాల్డో, ఎంబాపె (ఫుట్‌బాల్‌), ఖాతాలకు కూడా 'బ్లూ మార్క్‌'లు కనిపించవు.

ఏమిటీ 'బ్లూ టిక్‌'?

సచిన్‌ లేదంటే ఇంకే హీరో పేరు మీద ఇతరులు కూడా నకిలీ ఖాతాలు తెరుస్తారు. కానీ అసలైన సచిన్‌ టెండూల్కర్‌ ట్విట్టర్‌ ఖాతా ఏదంటే మాత్రం 'బ్లూ టిక్‌'తో వెరిఫైడ్‌ ఐడెంటిటీ తేలిపోతుంది. ఇప్పుడీ అధికారిక ముద్ర కోసం డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. వెరిఫైడ్‌ ఐడెంటిటీ కావాలంటే వెబ్‌ పోర్టల్‌కు రూ. 650, మొబైల్‌ ఫోన్లకు రూ. 900 ప్రతి నెలా చెల్లించాలి. 'బ్లూటిక్‌' మార్క్‌ తొలగించడంతో సచిన్‌ తన అధికారిక ఖాతాలో జాతీయ పతాకాన్ని పెట్టుకొని ఇదే నా 'బ్లూ టిక్‌ వెరిఫికేషన్‌' అని కామెంట్‌ జత చేశాడు.